

రేపు వైద్యశాఖ ఉద్యోగుల 'స్పందన'

పార్వతీపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న ప్రత్యేకంగా 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) బి.జగన్నాథరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం పార్వతీపురంలోని వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జీతాలు, ఇతరత్రా సమస్యలపై సిబ్బంది అర్జీలు ఇవ్వొచ్చని ఆయన చెప్పారు. స్పందన కార్యక్రమానికి వైద్యశాఖ ఉన్నతాధికారులంతా హాజరుకావాలన్నారు.

సమరానికి సై

- టీడీపీలో సరికొత్త జోష్
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభ్యర్థులను ప్రకటించడంతో శ్రేణుల్లో ఆనందం
- ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టిన అభ్యర్థులు



సాలూరు రూరల్: శివరాంపురంలో ప్రచార ర్యాలీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి, పార్టీ శ్రేణులు

పార్వతీపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూలు విడుదల కంటే ముందే... తొలి విడత జాబితాను టీడీపీ- జనసేన అధినేతలు విడుదల చేసి.. 'గెలుపు గుర్రాల'తో సై అనడంతో జిల్లా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల నుంచి బోనెల విజయచంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, తోయక జగదీశ్వరి పేర్లు ఖరారు చేశారు. దీంతో జిల్లాలోని శ్రేణుల్లో కొత్త జోష్ నెలకొంది. సమరానికి సై అంటూ టీడీపీ-జనసేన కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగుతున్నారు. వైసీపీ సర్కారు ఓటమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రచారాలను ప్రారంభించారు. సర్కారు వైఫల్యాలను ఎండగడుతూ... ప్రజలను చైతన్యపరిచారు.

పార్వతీపురం నియోజకవర్గంలో...

పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయనున్న బోనెల విజయచంద్ర తన ప్రచారాన్ని ప్రారంభించారు. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ సమరోత్సాహంతో నినదించారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్న తనను ఆశీర్వదించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలను కలిసి ముందుకు సాగారు. బాబు ష్యూరిటీ పేరిట కొద్దిరోజులుగా ఆయన నియోజకవర్గంలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలతో పాటు పార్వతీపురం పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ.. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఆవశ్యకతను గ్రామస్థులకు తెలియజేస్తున్నారు. మొత్తంగా ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. మరోవైపు విజయచంద్ర, బొబ్బిలి నియోజకవర్గం ఇన్‌చార్జి బేబీనాయన ప్రత్యేక చొరవతో సీతానగరం, బలిజిపేట మండలాల్లో వివిధ గ్రామాల నుంచి వైసీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. పార్వతీపురం పట్టణం, మండలం నుంచి వైసీసీ నాయకులు తన అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు.

సాలూరు నియోజకవర్గంలో...

సాలూరు రూరల్: సాలూరు టీడీపీ అభ్యర్థిగా గుమ్మిడి సంధ్యారాణిని ఖరారు చేయడంతో ఆమె ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. రాజకీయపార్టీలకు సెంటి మెంట్ గ్రామమైన శివరాంపురం నుంచి ఆదివారం ప్రచారం ఆరంభించారు. తొలుత ఆమె గ్రామంలో శివాలయం, బంగారమ్మ తల్లి ఆలయాల్లో పూజలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో టీడీపీ శ్రేణులు ర్యాలీ చేశారు. టీడీపీని గెలిపించాలని నినదించా రు. రాక్షస పాలనకు అంతమొందించడానికి ప్రతి ఒక్క రూ సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు నాయుడు సీఎంను చేస్తే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుంద న్నారు. టీడీపీ అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ-జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలోకి 400 కుటుంబాలు



హాజరైన టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు

సీతానగరం: బలిజిపేట మండలం బర్లి గ్రామంలో ఆదివారం పార్వతీపురం, బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు బోనెల విజయచంద్ర, బేబీనాయన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బర్లి గ్రామ సర్పంచ్ గులిపల్లి అప్పలనాయుడు(వైసీపీ), రెడ్డి నారాయణరావు (నాని)తో పాటు వారి ఆధ్వర్యంలో 400 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అజ్జాడకు చెందిన వైసీపీ సీనియర్ నేత ఎ.ఎల్లంనాయుడు తన అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి బోనెల విజయచంద్ర, బేబీ నాయనలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, వైసీపీ దుర్మార్గ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



బర్లిలో వైసీపీ గ్రామ సర్పంచ్ తదితరులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విజయచంద్ర, బేబీనాయన

కురుపాం నియోజకవర్గంలో...

కురుపాం నియోజకవర్గం నుంచి టీడీపీ- జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా తోయక జగదీశ్వరి తొలిసారి ఎన్నిల బరిలో దిగుతున్నారు. ఆమెది రాజకీయ కుటుంబం. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆశీస్సులతో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించేందుకు అందరి సహకారంతో ముందుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా తొలిజాబితాలో జిల్లాకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురి పేర్లు ఖరారు కావడంతో ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభ్యర్థుల పేర్లు వెల్లడించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇదే ఉత్సాహంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు తెలుగుదేశం-జనసేన పార్టీల కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిస్తున్నారు.

ఎలా వాయిదా వేస్తారు?

- చలో విజయవాడపై జేఏసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం: యూటీఎఫ్

బెలగాం, ఫిబ్రవరి 25: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పరి ష్కరించకపోయినా 'చలో విజయవాడ 'ను అర్ధాంతరంగా వాయిదా వేయడం ఎంత వరకు సమంజసమని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి మురళీమోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఏపీ జేఏసీ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. లక్షలాది మంది ఉద్యోగుల, ఉపాధ్యాయుల తరఫున నిలబడి పోరాటం చేయాల్సిన జేఏసీ.. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడం తగదన్నారు. ఐఆర్‌పై, రూ.20వేల కోట్ల బకాయిలపై, పీఆర్సీపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా మినిట్స్ రూపంలో ఇవ్వ డం మోసపూరిత చర్యగా పేర్కొన్నారు. 2004, సెప్టెంబరుకు ముందు నియామక ప్రక్రి య పూర్తయిన వారికి పాత పెన్షన్ ఇస్తానని చెప్పిన హామీపై కూడా ఉత్తర్వులు ఇవ్వలే దన్నారు. పది వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కూడా తాత్సారం చేస్తున్నారని తెలిపారు.

మధ్యవర్తిత్వమే మేలు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 25: న్యాయస్థానం ఆశ్రయించిన వారు ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించేందుకు న్యాయవాదులు ప్రయత్నించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ అన్నారు. విజయనగరంలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ నూతన భవన సముదాయానికి ఆయనతో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనరసింహ మాట్లాడుతూ- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు వివాదాల పరిష్కారంలో మెలకువలను తెలుసుకోవాలన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్న వారికి జిల్లా కోర్టులో తమ వృత్తిని ప్రారంభించేలా సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహించాల్సి ఉందన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో న్యాయమూర్తులు

నూతన కోర్టు భవనాల ద్వారా మంచి వసతులు సమకూరనున్నాయని, వీటిని వినియోగించుకుంటూ న్యాయవాదులు సమాజానికి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్, అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, కలెక్టర్ నాగలక్ష్మి, ప్రధాన న్యాయాధికారి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, ఎస్పీ దీపిక తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- 21,043 మంది విద్యార్థుల హాజరు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 25: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో ఆదివారం చేపట్టిన గ్రూపు-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా 80 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 25,181 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 21,043 మంది మాత్రమే రాశారు. 4,138 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. ఉదయం 9.30 గంటలకే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థులను ముందుగా పోలీసు సిబ్బంది తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

ఇంకా పరాయి పంచనే..

- నూతన భవనం నిర్మాణం పూర్తయి ఏడాది..
- ప్రారంభోత్సవానికి నోచుకోని చినమేరంగి సర్కిల్ పోలీసు కార్యాలయం
- అద్దె గృహంలో నడుస్తున్న వైనం
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు

(జియ్యమ్మవలస)

జియ్యమ్మవలస మండలం చినమేరంగి సర్కిల్ పోలీస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. కోట్లాది రుపాయలతో నూతన భవన నిర్మించినా ఫలితం ఉండడం లేదు. పనులు పూర్తయి దాదాపు ఏడాది గడుస్తున్నా.. ఇంకా ప్రారంభించకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం అద్దె గృహంలో చాలీచాలని గదుల్లోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. 2018-19లో చినమేరంగిలో సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ నిధులు మంజూరయ్యాయి. ఏపీ పోలీస్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు నిర్మాణ బాధ్యత అప్పగించారు. అయితే భవన నిర్మాణం పూర్తయి ఏడాది కావ స్తున్నా.. ప్రారంభోత్సవం జరగడం లేదు. గతంలో భవనాల ప్రారంభానికి నాలుగైదు సార్లు తేదీలు నిర్ణయించారు. అయితే అనివార్య కారణాలతో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా గత పదిహేనేళ్లుగా ఒక పాఠశాల భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతోంది. 2022, నవంబరు 24 నుంచి చినమేరంగిలోని ఒక అద్దె ఇంట్లోనే సర్కిల్ ఆఫీసును నిర్వహి స్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో పోలీసుల విధుల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. సర్కిల్ ఆఫీసు కోసం నెలకు రూ. 4 వేల వరకు అద్దె చెల్లిస్తోంది. సొంత భవనం నిర్మాణం పూర్త యినా.. ఇలా అద్దె గృహంలో, పరాయి పంచన సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్ల నిర్వహణపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఈ సర్కిల్ పరిధిలో జియ్యమ్మవలస, చినమేరంగి, గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అయితే సర్కిల్ పోలీస్ ఆఫీసు ఒక అద్దె ఇంట్లో నిర్వహించడం వల్ల ఆయా పోలీస్ స్టేషన్లకు సంబంధించిన పలు విషయాలపై చర్యలు తీసుకోలేక పోతున్నారు. ప్రత్యేకమైన భవనంలో ఇది కొనసాగితే- అప్పుడప్పుడు అత్య వసర సమావేశాలు, నేర నిరోధానికి చర్యలు, పోలీస్ సిబ్బందితో సమా వేశాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభోత్సవానికి నోచని చినమేరంగి పోలీస్‌స్టేషన్, సర్కిల్ ఆఫీసు



అద్దె గృహంలో నడుస్తున్న సర్కిల్ పోలీస్ ఆఫీసు



పాఠశాల భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది..

చినమేరంగిలో సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్ నూతన భవనం నిర్మాణం పూర్తయి సుమారు ఏడాది గడుస్తోంది. అయితే దీని ప్రారంభోత్సవ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. పై నుంచి ఆదేశాలు రాగానే భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

-ఇ.చిన్నమనాయుడు, ఎస్ఐ, చినమేరంగి

మరో గిరిజన విద్యార్థి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి.. ● ఈ నెలలో ఇది నాలుగో ఘటన
- పటిష్ఠ చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల డిమాండ్

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో మరో గిరిజన విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఒకే నెలలో నలుగురు విద్యార్థులు మృత్యువాతపడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ 17న మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి అశోక్, 20న పాచిపెంట మండలం సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనిత, 21న గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి గురుకుల పీటీజీ పాఠశాల విద్యార్థి బిడ్డిక శృతి అనారోగ్య కారణంతో మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా అదే మండలం మరో విద్యార్థి మరణించడం చర్చనీయాంశమవుతోంది. తల్లిదండ్రులు శ్రీను, సత్యవతి, వార్డెన్ అప్పారావు చెప్పిన వివరాల మేరకు... గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తాడంగి వంశీ (చంటి) ఏడో తరగతి చదువుతున్నాడు. స్వగ్రామం తెన్నుఖర్జలో పూజ ఉందని విద్యార్థి తండ్రి శ్రీను శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లారు. ఎప్పటిలానే వంశీ రాత్రిపూట భోజనం చేసి తల నొప్పిగా ఉందని చెప్పి పడుకున్నాడు. రాత్రి 11 గంటల తర్వాత లేచి తనకు ఆకలిగా ఉందనడంతో తల్లి సత్యవతి మళ్లీ అన్నం పెట్టింది. ఆ తర్వాత నీరు తాగగా- వెంటనే అది విద్యార్థి ముక్కు, నోటి నుంచి వచ్చింది. కొద్దిసేపటికే కాళ్లు, చేతులు వంకరగా అయిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108కు ఫోన్ చేశారు. ఆ వాహన సిబ్బంది వచ్చి చూసేసరికి అప్పటికే వంశీ మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. పెద్దకొడుకు మరణించాడనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నారు. తమ బిడ్డ ఇలా అకస్మాత్తుగా దూరమవుతాడని అనుకోలేదని కన్నీమున్నీరవుతున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్యను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో ఒకే నెలలో నలుగురు గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అనారోగ్యంతో మృత్యువాతపడినా.. అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పార్వతీపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

- వాల్తేర్ డీఆర్ఎం సౌరవ్ కుమార్



మాట్లాడుతున్న డీఆర్ఎం

బెలగాం, ఫిబ్రవరి 25 : అమృత్‌భారత్‌లో పార్వతీపురం(బెలగాం) రైల్వేస్టేషన్ ఎంపికైందని వాల్తేర్ డీఆర్ఎం సౌరవ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పార్వతీపురం రైల్వేస్టేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- స్టేషన్ అభివృద్ధికి రూ.14.76 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల పనులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలో 550 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ ఎంపిక య్యాయని, వాటిలో పార్వతీపురం స్టేషన్ ఉందని అన్నారు. అత్యాధునిక హంగులతో పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను మోడ్రన్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. త్వరలోనే పనులు చేపడతామని స్పష్టం చేశారు.



పచ్చపూల సోయగం

ఈ ఫొటో చూసి అరకు అనుకుంటే పొరబడినట్టే. సాలూరు ఏజెన్సీలో వందలాది గిరిజన గ్రామాలకు ముఖద్వారమైన దత్తివలస వద్ద ఈ సుందర దృశ్యం చూపరులకు కనువిందు చేస్తోంది. ఆ గ్రామంలోని బురదాలమ్మ గుడి వద్ద చుట్టూ కొండల నడుమ ఉన్న కట్టిజనుము పూలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. ఈ మార్గం గుండా వెళ్లే వివిధ గ్రామాల ప్రజలను అవి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శంబర పోలమాంబకు దర్శనానికి ఆదివారం పెద్దసంఖ్యలో వెళ్లిన భక్తులు ఈ ఆహ్లాదకర ప్రదేశంలో ఆగి సెల్ఫీలు దిగారు.

- సాలూరు రూరల్

ఉద్యోగి ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీం

గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోని మండలవారి కాలనీలో ఆదివారం తెల్లవారు జామున ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దొంగలు చొరబడి నగదుతో పాటు బంగారం అపహరించుకుపోయారు. సీఐ ఎన్‌వీ ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలవారి కాలనీలో నివాసం ఉంటున్న యాసర్ల అప్పలనాయుడు కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం విజయనగరంలోగల తమ సమీప బంధువుల వివాహానికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చేసరికి, తలుపులు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. సుమారు పది తులాల బంగారంతో పాటు రూ.10లక్షలు అపహరించుకుపోయినట్లు బాధితులు పోలీసులకు సమాచారం అందజేశారు. అందిన సమాచారం మేరకు విజయనగరం నుంచి క్లూస్‌టీం వచ్చి, ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెలమలకు సముచిత స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న చినబాబు

గజపతినగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వెలమ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీల్లో సముచిత స్థానం కల్పించాలని వెలమ సంక్షేమ సంఘాల ప్రతినిధులు చుక్క చినబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాల్తేరు కళ్యాణ మండపంలో వెలమ సంఘ నాయకులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వెలమ కులస్తులకు 5 పార్లమెంట్ స్థానాలతో పాటు 23 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు తెలిపారు. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని, వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాలో భారీ ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించే దిశగా ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలమ కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి


ఏఎన్‌ఎంల సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

పాలకొండ: ఏఎన్‌ఎంల విధుల సమయాలను సరిదిద్దాలని, యాప్‌ల సంఖ్య తగ్గించాలని పాలకొండ డివిజన్ హెల్త్ సెక్రటరీస్ కన్వీనర్ ఎ.డిల్లేశ్వరి కోరారు. పట్టణంలోని స్థానిక రామా డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. సచివాలయ అధికారులతో అనేక సమస్యలు ఉన్నాయని, వీటిని పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందివ్వాలని నిర్ణయించారు. పని ఒత్తిడి కారణంగా విధుల నిర్వహణ కష్టంగా ఉందని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా యూనియన్ నాయకులు డి.సాయి ప్రసాద్, బి.మురళి, డి.ఝాన్సీ, వై.ప్రభావతి, పాలకొండ సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన నాయకులు బి.మురళి, అధ్యక్షురాలు ఝాన్సీ, సీఐటీయూ నాయకురాలు ప్రభావతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందన


కొళాయిని ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

మక్కువ: ప్రజా సమస్యలు తెలుసుకుని, తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకుంటున్నామని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గేదెల రిషివర్ధన్ తెలిపారు. పెద ఊటగెడ్డ గ్రామంలో ఏర్పాటుచేసిన తాగునీటి ట్యాంకును అయన ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా గ్రామానికి తాగునీటి సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలియజేయడంతో, తక్షణమే ట్యాంకును నిర్మించి, కొళాయిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుగుణేశ్వరరావు, గొట్టాపు వెంకటేష్, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

మక్కువ: ములక్కాయవలస గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఆదివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో చెత్తను తొలగించి, డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులవీణ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ పీవో ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు

- కిమ్మి గ్రామంలో కాలువలు లేని వైనం
- విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు


రహదారిపై మురుగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: కిమ్మి గ్రామంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు బయటకు వెళ్లేందుకు కాలువలు లేవు. దీంతో రోడ్డుపై నుంచే మురుగునీరు ప్రవహిస్తోంది. దీని కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని ఆ గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


గరుగుబిల్లి: సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు


మక్కువలో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

మక్కువ: వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని సాలూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మక్కువలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా మండల కేంద్రానికి వచ్చిన ఆమెకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో పార్టీ మండలఅధ్యక్షుడు గురువా వేణు గోపాల్, జనసేన మండల అధ్యక్షుడు గేదేల రుషివర్ధన్, సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు, బి.గౌరీశంకర్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అన్నారు. నాగూరు గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జిలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీతంపేట: పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న జయకృష్ణ

టీడీపీలో 70 కుటుంబాల చేరిక

సీతంపేట: మండలంలోని కేపీ ఈతమానుగూడ గ్రామంలో వైసీపీకి చెందిన 70 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవరతోట ముఖలింగం, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, పాలక ఆదినారాయణ, ఐటీడీపీ కో-ఆర్డినేటర్ హిమరిక పవన్, తెలుగు యువత అధ్యక్షుడు సవర సంతోష్, క్లస్టర్ ఇన్‌చార్జి నిమ్మక చంద్రశేఖర్, సింహాద్రి, చంద్రయ్య, సవర మంగయ్య, సవర కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు టీడీపీ-జనసేన పొత్తు కోరుకుంటున్నారు


మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ-జనసేన పొత్తును ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ, జనసేన ప్రకటించిన అభ్యర్థులపై ఇరు పార్టీలు ఎంతో నమ్మకంతో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కోటి 3లక్షల 33 వేల మందికిపైగా ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకుని ఈ జాబితాను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. కొత్త జాబితాలో 23 మంది కొత్తవారికి సీట్లు కేటాయించారని, 99 సీట్లలో 15శాతం సీట్లు మహిళలకు కేటాయించారని చెప్పారు. మాదిగ సామాజిక వర్గం నుంచి 11 మందికి, మాల సామాజిక వర్గం నుంచి 8 మందికి ప్రాతినిధ్యం కల్పించినట్టు వెల్లడించారు. టీడీపీ అభ్యర్థుల జాబితాను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు. ఈ జాబితాలో ఎస్సీలకు 19 మందికి సీట్లు ఇచ్చారన్నారు. జగన్‌రెడ్డి కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిన ఎస్సీలకు టీడీపీ మాత్రం ప్రోత్సాహాన్ని ఇచ్చిందని జగదీశ్వరి పేర్కొన్నారు.

వైసీపీని సాగనంపడమే లక్ష్యం

- పిలుపునిచ్చిన జనసేన నాయకుడు సురేష్


మాట్లాడుతున్న మర్రాపు సురేష్

గజపతినగరం: వైసీపీ ఓటమే లక్ష్యంగా జనసేన నాయకులు పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మర్రాపు సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోగల నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ ప్రకటించే స్థానాలు కంటే, ఆయన గురిపెట్టిన లక్ష్యాన్ని చూడాలని, ఆ విధంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డాక్టర్ రవికుమార్, వీర మహిళ దుర్గ, పండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయచంద్ర గెలుపునకు కృషి


విజయచంద్రకు అభినందనలు తెలుపుతున్న జనసేన నాయకులు

బెలగాం: పార్వతీపురం నియోజకవర్గం జనసేన-టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన బోనెల విజయచంద్రను గెలిపించడమే లక్ష్యంగా పని చేస్తామని జనసేన నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసేన నాయకులు చందక అనీల్, ఎన్.సురేష్, ఆర్.రాంబాబు, ఎస్.గౌరీ ఎం.ప్రవీణ్ తదితరులు విజయచంద్రను కలిసి, అభినందనలు తెలిపారు. టీడీపీతో కలిసి జనసేన పనిచేసి విజయకేతనం ఎగరవేస్తామని వారు తెలిపారు.

అదితికి అభినందనలు

నెల్లిమర్ల: విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పూసపాటి అదితి గజపతిరాజును ప్రకటించడంతో పార్టీ మండల నాయకులు ఆమెకు అభినందించారు. ఆదివారం విజయనగరంలోని తన స్వగృహానికి వెళ్లి, ఆమెను సన్మానించారు. సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, పోతల రాజప్పన్న, అవనాపు సత్యనారాయణ, దన్నాన రామ్మూర్తి పాల్గొన్నారు.


అదితి గజపతిరాజుకు అభినందనలు తెలుపుతున్న నెల్లిమర్ల నాయకులు

ఆధునికీకరణ దిశగా పార్వతీపురం రైల్వేస్టేషన్

బెలగాం: పార్వతీపురం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ దిశగా అడుగులేస్తోంది. ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను అమృత భారత్ ప్రాజెక్టులో ఎంపిక చేశారని, సోమవారం ఆధునీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని బీజేపీ జిల్లా కార్యదర్శి ద్వారపురెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేశంలో మొత్తం 550 రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ ప్రాజెక్టులో ఎంపిక చేసిందని, అందులో పార్వతీపురం స్టేషన్‌కు స్థానం కల్పించడం అదృష్టమని అన్నారు.

పుర్రేయవలసలో బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు


చీపురుపల్లి: పుర్రేయవలస గ్రామంలో బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా పుర్రేయవలస, రన్నర్స్‌గా చీపురుపల్లి టీంలు నిలిచాయి. విజేతలకు మెమొంటోలు, కప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్ యు.హరి, ఆశయ అధ్యక్షుడు రెడ్డి రమణ, గ్రామ యువత పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ

- తాగునీరు వృథా


రోడ్డుపై వృథా పోతున్న తాగునీరు

సాలూరు రూరల్: స్థానిక లయన్స్‌క్లబ్ పాఠశాల సమీపంలో పైపులైన్ లీక్ కావడంతో తాగునీరు వృథా పోతోంది. నిత్యం ఇక్కడ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. ఇదే రహదారి గుండా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఎవరూ పట్టించుకున్న పరిస్థితి లేదు. అలాగే దండిగాం రోడ్డులో డీసీసీబీ బ్యాంకు సమీపంలో తాగునీటి పైప్‌లైన్‌కు లీకు ఉండడంతో తాగునీరు కలుషితం అవుతుందని పలువురు వాపోతున్నారు.



ఘనంగా శ్రీరాముని పట్టాభిషేకం

నెల్లిమర్ల: రామతీర్థంలోని రామస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ఘనంగా పట్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ఎండబెడుతున్న పంట

- వాహనదారుల తిప్పలు


పంట చిక్కుకోవడంతో ఆగిన కారు

సాలూరు రూరల్: రోడ్డుపై పంటను ఎండబెట్టడం వల్ల వాహ నదారులు తిప్పలు పడుతున్నారు. మామిడిపల్లి వద్ద ఎండబెట్టిన పంట ఆటుగా వెళ్లిన కారు కిందకు చిక్కు పోయింది. దీంతో కారు ఆగిపోయింది. డ్రైవరు తిప్పలు పడ్డాడు.

విద్యా పురస్కారాల పంపిణీ

ఒడిశా

రాయగడ: విద్యా పురస్కారం.. జ్ఞాన బహుమానమని రాష్ట్ర హరిజన, గిరిజన, మైనారటీ, న్యాయ శాఖా మంత్రి జగన్నాథ సారక అన్నారు. ఆదివారం స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా యంత్రాంగం, జిల్లా విద్యాశాఖ విభాగం సంయుక్తంగా ముఖ్యమంత్రి విద్యా పురస్కార కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సారక పాల్గొని, మాట్లాడారు. 11 సమితులకు చెందిన 1800 మంది విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయగడ సమితికి చెందిన 50మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ అధ్యక్షురాలు అనసూయ మాఝి, ఎమ్మెల్యే మకరంద ముదిలి, 5టీ జిల్లా కోఆర్డినేటర్ పట్నాన గౌరీశంకరరావు, జిల్లా విద్యాశాఖాధికారి పూర్ణచంద్ర బొరిహా తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు


మాట్లాడుతున్న కేఏ నాయుడు

గజపతినగరం: ఎవరూ అధైర్య పడవద్దని, తమ అభ్యర్థిత్వంపై రానున్న పది రోజుల్లో పునరాలోచ చేయాలని అదిష్టానాన్ని కోరామని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోగల గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, బొండపల్లి, జామి మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు ఇంతవరకు నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశానని చెప్పారు. పార్టీ నాయకులు పీవీవీ గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరకవలసలో దేశమ్మతల్లి వారోత్సవాలు


ఊరేగింపుగా వెళ్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: కరకవలస గ్రామంలో దేశమ్మతల్లి వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా ఘటాలతో గ్రామ పొలిమేరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ దేశమ్మతల్లికి గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. థింసా వాయిద్యాలతో తిరిగి వచ్చారు.

అభ్యర్థిని మార్చకపోతే రాజీనామా చేస్తాం

నెల్లిమర్ల /భోగాపురం: టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని స్థానిక పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, ఈ విషయాన్ని వెల్లడించారు. పార్టీ నాయకులు ఆనంద్‌కుమార్, రవిశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ● పోలిపల్లిలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ మాట్లాడారు. బంగార్రాజుకు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిళ్లు వస్తున్నాయన్నారు. దానికి ఆయన అంగీకరించకపోతే తానే ఇంటిపెండింట్‌గా పోటీచేస్తానని సత్యనారాయణ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

భామిని: బత్తిలి ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో భామిని సెంటర్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరగడంతో పలు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. వాహన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈసందర్భంగా భామిని, బత్తిలి తదితర గ్రామాల్లోని కూడళ్ల వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు.

క్లుప్తంగా..

ప్రణాళికాబద్ధంగా చదవాలి

సీతంపేట: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. ఆదివారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సౌకర్యాల కల్పన ఏ మేరకు ఉందో పరిశీలించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాజేంద్రనాయుడు

పాలకొండ: బీజేపీ యువమోర్చ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వారాడ రాజేంద్రనాయుడును నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఒకే ఆవుకు రెండు దూడలు


రెండు దూడలతో ఆవు

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామానికి చెందిన నగిరెడ్డి శ్రీరాము లు నాయుడుకు చెందిన ఆవుకు శనివారం రాత్రి రెండు దూడలు జన్మించాయి. ఆవులకు రెండు దూడల జననం అరుదుగా ఉంటుందని గరుగుబిల్లి ఏరియా పశు వైద్యశాఖ అసి స్టెంట్ డైరెక్టర్ డా.బి.గణపతిరావు, మండల పశు సంవ ర్థకశాఖ అధికారి డా.ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు.

యువత ఓటుతో రాష్ట్ర భవిష్యత్ మార్చాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లలితకుమారి

లక్కవరపుకోట: రాష్ట్ర భవిష్యత్ యువత ఓటుపై ఆధారపడి ఉందని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఆమె ఎల్.కోటలో విలేఖరుల సమావేశం నిర్వహించి ఓటర్ల బాధ్యతను గుర్తు చేశారు. ధైర్యంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జగన్ చేతిలో దగాపడ్డ రాష్ట్రాన్ని యువకులే బాగుచేయాలన్నారు. రాష్ట్రం నుంచి మంచి కంపెనీలు తరలిపోయిన విషయాన్ని యువకులు గుర్తుచేసుకోవాలన్నారు. సంఘం సతీష్, రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: విశాఖపట్టణం పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన టౌన్ హాల్ మీటింగ్‌కు శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. టీడీపీ అనుబంధ విభాగాల సహకారంతో మొదటిసారిగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు లలిత కుమారి తెలిపారు. విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి శ్రీభరత్, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారన్నారు.

బోరుబావులు ప్రారంభం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సీతారాంపురం, గోపాలపల్లి గ్రామాల పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన బోరుబావులను ఎంపీపీ సోమేశ్వరరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, గోపాలపల్లి ఉప సర్పంచ్ రంధి గణేష్ తదితరులున్నారు.

ఎస్.కోటలో తాగునీటి ఇక్కట్లు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25: శృంగవరపుకోట నియోజకవర్గంలోని పలు గ్రామాలు తాగునీటి ఇక్కట్లును ఎదుర్కొంటున్నాయి. తాటిపూడి పైలెట్ ప్రాజెక్టు నుంచి మూడు రోజులుగా తాగునీటి సరఫరాను ఆపేశారు. ఈ పైలెట్ ప్రాజెక్టు హెడ్ వద్ద సాంకేతిక లోపం ఏర్పడినందున శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా ఉండదని ఈ ప్రోజెక్టు అధికారులు చెప్పారు. ఆదివారం ఉదయం నుంచి తాగునీటి సరఫరా పునరిద్ధరిస్తామని తెలిపారు. కానీ ఈ విధంగా సరఫరా మాత్రం జరగలేదు. గత వారం రోజుల నుంచి ఈ పైలెట్ ప్రాజెక్టు నుంచి ఒక రోజు తాగునీటి సరఫరా ఉంటే మరో రోజు సరఫరాను ఆపేస్తున్నారు. ఎప్పుడడిగినా ఎదో ఒక సాంకేతిక లోపం చెబుతున్నారు.

చలో అసెంబ్లీ వాయిదా తగదు

బొబ్బిలి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాల్సిన ఏపీ జేఏసీ ఒంటెద్దు పోకడలతో వ్యవహరించడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం సాయంత్రం సీనియర్ నేత బంకురు జోగినాయుడు అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 న నిర్వహించాలనుకున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. జేఏసీ నాయకత్వం ఉద్యమాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వారి నిర్ణయంతో లక్షలాది మంది ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. 20 కోట్ల రూపాయల ఆర్థిక బకాయిలు, పాత పెన్షన్ విధానం, పీఆర్‌సీ బకాయిలు వంటివాటిపై ఎటువంటి స్పష్టత లేకుండానే అర్ధాంతరంగా ఆందోళనను వాయిదా వేయడం ఉద్యోగ వర్గాలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రవీణ్‌కుమార్, ఎల్లయ్య, లక్ష్మణరావు, శ్రీను, మోహనరావు, భక్తదర్శనం, ప్రసాద్ , పరిశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి: స్థానిక స్వామివారి వీధిలో శ్రీవేంక టేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం రెండోరోజు ఘనంగా పూజలు నిర్వ హించారు. ఆలయ ధర్మకర్తమండలి ప్రతినిధులు మరిపి వేణుగోపాలరావు, మున్సిపల్ కౌన్సిలరు మరిపి తిరుపతిరావు ఆధ్వర్యంలో భక్తసంఘం ఘనంగా ఈ వేడుకలను నిర్వహించింది. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కారివలస గ్రామంలో ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు మందలిండంతో మనస్తాపం చెందిన మండంగి రమేష్(38) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేడు అమృత్ భారత్ రైల్వేస్టేషన్లకు శంకుస్థాపన

బొబ్బిలి, ఫిబ్రవరి 25: బొబ్బిలి పట్టణంలో 16.18 కోట్ల రూపాయలతో నిర్మించనున్న అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకంలో భాగంగా సోమవారం ఉదయం మోడల్ రైల్వే స్టేషన్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరగ ను న్నది. దేశవ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లు, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లకు ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వర్చువల్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా బొబ్బిలి మల్ల మ్మపేటలో వర్చువల్ శంకుస్థాపన కోసం రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. విశాఖ రైల్వే డీఆర్ఎం ఆదివారం బొబ్బిలి విచ్చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ● **కొత్తవలస:** కేంద్ర ప్రభుత్వం అమృత్‌భారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించిన కొత్తవలస రైల్వేస్టేషన్‌కు సంబంధించిన ఆధునికీకరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. దేశంలోని 554 రైల్వేస్టేషన్‌లు 1500 రోడ్డుఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాసేజ్‌లు నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొత్తవలస రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నందున కొత్తవలస రైల్వేస్టేషన్‌కు రైల్వేశాఖ అధికారులు సోమవారం రానున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 25: రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా విజయనగరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని, తనకి ఒక్క అవకాశం ఇవ్వాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని గాజులరేగ మెయిన్ రోడ్డు, సాయి కాలనీ, రైల్వే బ్రిడ్జి, కొత్తవీధి, శ్రీహరినగర్, గుబేల్‌పేట, ఆచంటనగర్, ఎస్సీ కాలనీ, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చారిత్రాత్మక విజయనగరం నియోజకవర్గం నుంచి తాను 2019లో ఎన్నికల బరిలో దిగానని, స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చెందానన్నారు. 2024 ఎన్నికల్లో తాను తిరిగి పోటీ చేస్తున్నానని ఒక్క అవకాశాన్ని ప్రజలు కల్పించాలని ఆమె అభ్యర్థించారు. నాలుగేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, మహిళా సంక్షేమం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. యువతకు ఉపాధి కరువైందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా, అధికారంలోకి వచ్చిన తరువాత జాబ్ కేలెండర్ ఊసే లేదన్నారు. నిత్యావసర, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలను పెంచు తూ, ప్రజలపై ఈ ప్రభుత్వం భారం వేసిందన్నారు. రానున్న ఎన్ని కల్లో టీడీపీని గెలిపించాలని ఆమె కోరారు. నగర టీడీపీ నాయ కులతో పాటు, డివిజన్ పార్టీ నాయకులు కర్రోతు నర్సింగరావు, కర్రోతు రాధామణి, తదితరులున్నారు.


కూరగాయాల విక్రయించే మహిళకు సూపర్ సిక్స్ హామీలను వివరిస్తున్న అదితి గజపతిరాజు

టీడీపీ-జనసేన జాబితాతో జగన్‌లో వణుకు

● మాజీ మంత్రి కోండ్రు ● పెనుబాక నుండి భారీగా చేరికలు

రాజాం, ఫిబ్రవరి 25: మండలం పెనుబాక గ్రామంలో ఆదివారం రాత్రి భారీగా చేరికలు జరిగాయి. వైసీపీ నుంచి టీడీపీలోకి మాజీ సర్పంచ్ చీడి కుమార్‌తో పాటు మరో 250 కుటుంబాలు చేరాయి. వారికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా తెలుగుదేశం జనసేన పార్టీలు తొలిజాబితాను విడుదల చేశాయన్నారు. టీడీపీ, జనసేనల తరపున ప్రకటించే అభ్యర్థులపై ఇరు పార్టీలు ఎంతో నమ్మకం ఉంచాయన్నారు. రాష్ట్రంలో ఒక కోటి మూడు లక్షల 33వేల మందికి పైగా ప్రజలు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను సిద్ధం చేశాయన్నారు. ఈ తొలిజాబితా అభ్యర్థుల్లో మరింత ఆత్మ విశ్వాసం పెంచిందన్నారు. రాజాం రూరల్ మండలం అధ్యక్షుడు సులమల వెంకట మన్మథరావు, మాజీ సర్పంచ్ చీడి జగన్నాథం, పొట్నా చిట్టిబాబు, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, రాంబాబు హరి, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చి ఎస్సీలు దగా పడ్డారని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ విమర్శించారు. ఆది వారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం రాజులగుమ్మడ, చినరాజుల గుమ్మడ గ్రామాలకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ పెట్టిన తరువాత ఎస్సీలకు రాజకీయంగా, ఆర్థికంగా అవకాశం కల్పించారని కోండ్రు గుర్తు చేశారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు తెలుగుదేశం పార్టీ ఎస్సీలకు న్యాయం చేస్తూ వచ్చిందన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వైసీపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో పతనం ఖాయమని కోండ్రు అన్నారు. 2024లో సీఎం జగన్‌రెడికి్డ దళితులంతా ఏకమై సత్తాచూపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జి గణపతి, కిర్లంగి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో యజ్జల సుధీర్, సామంతుల రమణయ్య, గుంపస్వామి, గొటేటి అప్పలస్వామి, దండాసి ప్రసాద్, యజ్జల సుజాత, యజ్జల ప్రసాద్ తదితరులు ఉన్నారు.


పార్టీ కండువా వేస్తున్న కోండ్రు

మెడికల్ కళాశాలలో లెక్చర్ గ్యాలరీ ప్రారంభం

విజయనగరం రింగు రోడ్డు, ఫిబ్రవరి 25: నగర శివార్లలోని గాజులరేగ వద్ద నూతనంగా నిర్మించిన మెడి కల్ కళాశాలలో లెక్చర్ గ్యాలరీ-1ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. గుజరాత్ రా ష్ట్రంలోని రాజ్‌కోట నుంచి దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్య క్రమంలో జేసీ కార్తీక్ స్క్రీన్‌ను ప్రారంభించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్ట ర్ పద్మలీల, డీఎంహెచ్‌వో భాస్కరరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంటెండెంట్ అనిలా సునందిని, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


లెక్చర్ గ్యాలరీని ప్రారంభిస్తున్న జేసీ

మహా గర్జనను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 25: రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 3న విశాఖపట్టణంలో జీఎంఏసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న మహాగర్జనకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ బి.కాంతారావు, కేజీబీవీ రాష్ట్ర కన్వీనర్ తేజేశ్వరీ పిలుపునిచ్చారు. ఆదివారం కేఎల్ పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు పార్ట్‌టైం విధానాలపైన స్పష్టమైన రాజకీయ వైఖరి ప్రకటించాలన్నారు. రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగభద్రత పెన్షన్‌పై నిర్దిష్టంగా అనుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయకుండా వేతనాలు పెంపుదలలో అన్యాయం చేశారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 3న మహాగర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాలికల పోటీల్లో ద్వితీయ స్థానం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 25: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈ నెల 24న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజయనగరం జట్టులోని మజ్జి పావనీ టోర్నమెంటు బెస్ట్ ఆల్ రౌండర్‌గా నిలిచింది. విజయం సాధించిన బాలికల జట్టుని కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రంగారావు దొర, ప్రభావతి, కోరాడ వేణుగోపాల్‌తో పాటు పలువురు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.


విజయం సాధించిన విజయనగరం బాలికల జట్టు

మహోన్నతమైన వ్యక్తి పీవీ

జామి, ఫిబ్రవరి 25: ప్రపంచం గర్వించదగిన మహోన్నతమైన వ్యక్తి పీవీ నర్సింగరావు అని మాజీ మంత్రి పడాల అరుణ అ న్నారు. ఆదివారం మండల కేంద్రమైన జామిలో ఆర్క ఫౌండేషన్ వైజాగ్ వెస్టీటీం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు పీవీకి భారత రత్న వచ్చిన సంద ర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పక్షవాతంతో బాధపడు తున్న ఆశపు పేర్రాజు అనే వృద్ధురాలికి రూ.10వేలు, వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న వెంకటరావుకు రూ.ఐదువేలు అందించారు. పంచాయతీ సర్పంచ్ లక్ష్మి, ఎల్‌అండ్‌టీ వెసె ల్ ప్రాజెక్ట్ డీజీఎం మోహన్, బొత్స కృష్ణకాంత్, ఆర్. రామ్మోహన్, ప్రవీన్‌రెడ్డి, నవీన్‌కుమార్, యల్లపు నగేష్ తదితరులున్నారు.


నివాళి అర్పిస్తున్న అరుణ

పడకేసిన పశువైద్యం

● అస్తవ్యస్తంగా సేవలు

● మూగజీవుల మౌన రోదన

నెల్లిమర్ల, ఫిబ్రవరి 25: జిల్లాలో పశు వైద్యం పడకేసింది. సీజనల్ వ్యాధులతో పశువులు విల్లవిల్లాడుతున్నాయి. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఆ మధ్య లంపీస్కిన్ వ్యాధి ప్రబలింది. రెండేళ్ల కిందట జిల్లాలో ప్రవేశించిన ఈ వ్యాధి పెను ప్రభావమే చూపింది. చాలా పశువులు మృత్యువాతపడ్డాయి. టీకాలు వేయడంతో తగ్గుముఖం పట్టింది. తరువాత పట్టించుకోకపోవడంతో అక్కడక్కడ వెలుగులోకి వస్తోంది. దీనికితోడు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో పాడి రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కానరాని వైద్యశిబిరాలు

గతంలో వర్షాకాలం ముంగిట గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను ఏర్పాటుచేసేవారు. పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేసేవారు. ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి శిబిరాలు కొనసాగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పశు వైద్యాధికారులు, సిబ్బంది ఆస్పత్రి దాటి గ్రామాలకు చేరడం లేదు. గ్రామ సచివాలయలో పశువైద్య కార్యదర్శి ఉన్నా.. ప్రేక్షక పాత్రమే పరిమితమవుతున్నారన్న అపవాదు ఉంది.

భారీ యంత్రాంగం ఉన్నా..

జిల్లాలో 13 ప్రాంతీయ పశు ఆస్పత్రులు, 65 పశు వైద్యశాలలు, 40 గ్రామీణ పశు వైద్యశాలలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దీనికితోడు ప్రతీ సచివాలయంలో పరిధిలో వెటర్నరీ కార్యదర్శిని నియమించారు. వీరికితోడు గోపాలమిత్రలు కొనసాగుతున్నారు. అయినా పశువైద్యం అందని దుస్థితి. క్షేత్రస్థాయిలో గ్రామాలకు వచ్చి వైద్యం అందించిన వారు కరువయ్యారు. గతంతో పోల్చితే పాడి ఆవుల పెంపకం పెరిగినా అంతుచిక్కని రోగాలకు వైద్యసేవలందక పశువులు చనిపోతున్నాయి. ముఖ్యంగా జెర్సీ వంటి ఆవులు ఈత సమయంలో తల్లీబిడ్డ రెండూ మృత్యువాత పడుతున్నాయి. ఆ సమయంలో పాడి రైతులకు జరిగే నష్టం ఊహకు అందడం లేదు. ఆ మధ్యన జిల్లా వ్యాప్తంగా లంపీస్కిన్ వ్యాధి తీవ్రంగా ఉండేది.


రామతీర్థం పశువైద్య కేంద్రం

అక్కరకు రాని అంబులెన్స్ సేవలు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున పశువుల కోసం మొబైల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. కానీ ఈ అంబులెన్స్ సేవలు సక్రమంగా అందడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం ఫోన్ చేస్తే.. సాయంత్రానికి కానీ చేరుకోని దుస్థితి. సంబంధిత పాడిరైతులు ప్రశ్నిస్తే నియోజకవర్గానికి ఒకటి మాత్రమే ఉందని.. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. అటు మారు మూల గ్రామాలకు అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి. రోడ్లు బాగాలేదని.. సాంకేతిక సమస్యలు సాకుగా చూపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు అధికారులు మాత్రం అంతా సవ్యంగా సాగుతున్నట్టు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా పశువైద్యంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.

అయినా.. ఇసుకను వదలరు

● భారీ స్థాయిలో తవ్వకాలు

● చోద్యం చూస్తున్న అధికారులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 22: వేములాపల్లి వద్ద గోస్తనీ నది వంతెన పైనుంచి ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణిస్తారు. ఈ నది నుంచి సమీప గ్రామాల ప్రజలకు నీరు అందించేందుకు ఊటబావులు పెద్ద ఎత్తున ఉన్నాయి. నిబంధనల ప్రకారం వంతెనకు.. ఊటబావులకు 500 మీటర్ల లోపు ఎటువంటి తవ్వకాలు చేయకూడదు. కానీ ఐదేళ్లుగా ఈ వంతెన కింద, ఊట బావుల వద్ద నుంచి పగటి పూట నాటుబళ్లతో ఇసుకను తీసుకెళ్లి... రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో విజయనగరం, ఎస్.కోట ప్రాంతాలకు తరలించి రూ.లక్షల్లో సంపా దిస్తున్నారు. కొంతమంది ఈ ఇసుక తవ్వకాలకు తమ దారుల్లో నుంచి వెళ్త న్నారని ఇనుప గేట్లు బిగించి ప్రతి నాటు బండి నుంచి రూ.వంద చొప్పున వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే వారికి చుక్కలు చూపిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తిని హెచ్చరించి.. ఇనుప గేటును తొలగించారు. వంతెన, ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలను నిరోధించేందుకు కందకాలు తవ్వించారు. ఇదంతా తాత్కాలికమే. వారం రోజుల తరువాత పరిస్థితి మొదటికి వచ్చింది. కందకాలను కప్పించేసి తిరిగి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు. దీంతో వంతెన కింద భాగం చాలా వరకు దెబ్బతిని ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. ఇక ఊటబావుల చుట్టూ ఇసుకను పెద్దఎత్తున తవ్వే యడంతో రూ.లక్షల విలువైన పైప్‌లైన్ దెబ్బతింది. ఆంజనేయ గుడి నిర్మాణం పేరుతో కొంతమంది మహిళల ద్వారా ఒక్కో ఇసుక బండి నుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. తాగుబోతులు, ఆకతాయిలు కూడా గుడి పేరుతో గోస్తనీ తీరం వద్ద పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించి మరీ ఇక్కడ ఇసుక తవ్వకాలు సాగిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి.. ఇక్కడ ఇసుక తవ్వకాలను నిరోధించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


వంతెన ఆనుకొని ఇసుక తవ్వకాలు


ఊటబావుల వద్ద ఇసుక తవ్వేయడంతో బయటకు వచ్చిన పైప్‌లైన్ భాగం

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

● టీడీపీ సీనియర్ నేత రొంగలి

విజయగనరం రూరల్, ఫిబ్రవరి 25: ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయమే జరిగిందని టీడీపీ సీనియర్ నేత రొంగలి రామారావు చెప్పారు. 'జయహో' బీసీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 8, 27, 28 డివిజన్లలోనూ, సాయంత్రం 35, 36, 37 డివిజన్లలో టీడీపీ బీసీ విభాగం నాయకులు పర్య టించారు. ఈ సందర్భంగా లంకవీధిలోని సారిక వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బీసీలపై దాడులు పెరిగాయని, బీసీలకు ఉపాధి కరువైందని, గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఆదరణ పథకాన్ని ఎత్తేశారన్నారు. దీంతో వృత్తిదారుల సమస్యలు వర్ణనాతీతంగా మారాయన్నారు. విధులు, నిధులు లేని కార్పోరేషన్లు ఏర్పాటు చేసి బీసీలను మోసం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. టీడీపీ నాయకులు కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ, బీసీల సంక్షేమం కోసం కృషి చేసిన పార్టీ టీడీపీయేనన్నారు. టీడీపీ నాయకులు నంబూరి నాగమణి, సారిక వెంకటరమణ, బమ్మిడి నారాయణమ్మతో పాటు ఆయా డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ఎస్.కోటలో అనసూయ సందడి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25: శృంగవరపుకోట పట్టణంలో ప్రముఖ టీవీ యాంకర్, సినీనటి అనసూయ సందడి చేశారు. ఆదివారం విశాఖ-అరకు రోడ్డకు ఆనుకుని ఏర్పాటుచేసిన శ్రీ ఆదిలక్ష్మి జ్యూయలర్స్ బ్రాంచి ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. స్వర్ణ ఆభరణాలను చూశారు. దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ శ్రీ ఆదిలక్ష్మి జూయలర్స్ కస్టమర్ల మన్ననలను పొందుతుందని ఆకాంక్షించారు. అనసూయను చూసేందుకు పలువురు స్థానికులు, అభిమానులు పోటెత్తారు. మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ తదితరులున్నారు.


జ్యూయలర్స్‌ను ప్రారంభిస్తున్న అనసూయ

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

● వ్యక్తి మృతి

సీతానగరం: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన లచ్చయ్యపేట గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వంగర మండలం చౌదరివలస గ్రామానికి చెందిన పి.రాంబాబు(30) బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, లచ్చయ్యపేట గ్రామ సమీపంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలో రెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం ఉంగరాడ మెట్ట వద్ద 13 మద్యం సీసాలతో పట్టుబడినట్లు ఏఎస్ఐ మన్మథరావు తెలిపారు. బెల్టుషాపుకోసం బాటిళ్లు తీసుకువెళ్తుండగా పట్టుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టుచేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. తనిఖీలో కానిస్టేబుల్ శివ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండల బుడ్డెమ్మఖర్ల గ్రామం సమీపంలో ఉన్న మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొని ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కురుపాం మండలం దుర్బిలి గ్రామానికి చెందిన టి.హినత్, తులసి భార్య భర్తలు. వీరు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి వెళ్తుండగా, గొటివాడ గ్రామానికి చెందిన కె.చంటి, సంతోష్ ఎదురుగా ద్విచక్ర వాహనంతో వస్తూ బుడ్డెమ్మఖర్ల సమీపంలో ఢీకొన్నారు. ఘటనలో గాయపడిన వారిని వెంటనే స్థానికులు కురుపాం ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది చికిత్స అందించి పోలీసులకు సమాచారం అందించారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి


మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం రూరల్, ఫిబ్రవరి 25: మున్సిపల్ కార్మికుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం పోరుబాట సాగించిన మున్సిపల్ కార్మికులకు ప్ర భుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీఓలు జారీ చేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజాంలో మున్సిపల్ కార్మికులతో ఆది వారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రభుత్వతీరుపై మండిపడ్డారు. మంత్రులు, అధికారల సమక్షంబలో సంక్రాంతి కానుక రూ.1000, సమ్మెకాలపు జీతం చెల్లింపునకు సంబంధించిన జీఓలు జారీ చేసిన ప్రభుత్వం వాటిని నేటికీ అమలు చేయలేదని ఆరోపించారుక్లీన్ ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి రూ.21 వేలు శానిటేషన్ డ్రైవర్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి కార్మికులకు రూ.24,500, విలీన గ్రామ పంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21 వేలు జీతం ఇవ్వ డంతో పాటు మరిన్ని సమస్యల పరిష్కారం కోసం హామీలిచ్చి అమలు చేయలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓలు జారీ చేసి అమలు చే యాలని రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. అనిల్‌కుమార్, గురువులు, లక్ష్మి, గిరిబాబు పాల్గొన్నారు.

సాహిత్యం ప్రజలను కదిలించాలి

రాజాం, ఫిబ్రవరి 25: కవిత్వం ప్రజా స మూహాలను కదిలించడమో, ఆనంద పరచడమో చేయాలే తప్ప ప్రజలకు అగమ్యగోచరంగా ఉండకూ డదని ప్రముఖ సాహితీవేత్త బమ్మిడి సుబ్బారావు తెలిపారు. ఆదివారం స్థానిక మాధవ బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాజాం రచయితల వేదిక 109వ సమావేశం జరిగింది. కార్యక్రమంలో సుబ్బారావు సామాజిక అవసరమైన సాహిత్యం అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. గురజాడ, శ్రీశ్రీ వంటి కవులు ప్రజలను కదించే కవిత్వాలు రాయడంవల్లనే ప్రఖ్యాతి గడించారన్నారు. తరువాత సుబ్బారావు రాసిన జనజాగృతి గీతాలను అదే ఊరికి చెందిన పాలక కామేశ్వరరావు ఆలాపన చేశారు. నల్ల రవికుమర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వీరిద్దరికీ సన్మానం జరిగింది. నిర్వాహకుడు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, ఉరిటి రామలింగేశ్వరరావు, అల్తి మోహన్‌రావు, పిల్లా తిరుపతిరావు, పెంకి దయానిధినాయుడు, పెంకి చైతన్యకు మార్, కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, పొదిలాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారావు

భక్తులు సద్గుణాలు అలవర్చుకోవాలి

రేగిడి, ఫిబ్రవరి 25: భక్తగణం ఉత్తమజీవనం ఆచరించాలని, సద్గుణాలు అలవర్చుకొని ముందుకు నడవాలని పాలకొండకు చెందిన సత్యసాయి సేవా ప్రతినిధి ఎన్‌వి రమణ పే ర్కొన్నారు. మండలంలో దేవుదళ గీతామందిరంలో ఆదివారం మందిర కన్వీనర్ గొర్లి దామోదర్ అధ్యక్షతన ది వ్యజ్ఞాన సత్సంగం నిర్వహించారు. ఈసభలో ఎన్‌వి రమణతో పాటు పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ఉత్తములుగా ఉండాల్సినవారికి ఉత్సాహం, సహసం, ధైర్యం, బుద్ధి శక్తి పరాక్రమం సద్గుణాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో వక్తలు జి దామోదర్‌రావు, మోహనరావు, బురి చిన్నంనాయుడు, జి సన్యాశిరావు, దేవుదళ, పరిసర గ్రామాల గీతభక్తులు పాల్గొన్నారు.


సత్సంగంలో మాట్లాడుతున్న వక్తలు